క్లుప్తంగా

అక్రమ ఇసుక లారీలు పట్టివేత



సుబ్బాయిగూడెం(వత్సవాయి): మండలంలోని సుబ్బాయిగూడెం ఇసుకరీచ్-1 నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 3 లారీలను తహసీల్దార్ లక్ష్మీప్రియ గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఇసుకరీచ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ పోలీస్ సిబ్బందితో కలిసి రేవు వద్దకు వెళ్లారు. అప్పటికే ఇసుకతో నింపి ఉన్న మూడు లారీలను అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకతో నింపి ఉన్న మూడు లారీలను అదుపులోకి తీసుకుని వాటిని స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ అర్జున్ వాటిపై కేసు నమోదు చేశారు.

భూ సమస్యలపై 222 అర్జీలు

వత్సవాయి: భూ రీసర్వే చేసిన గ్రామాలలో నిర్వహించిన గ్రామసభలలో మొత్తం 222 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎస్. నరసింహరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వాటిల్లో భూ విస్తీర్ణంలో తేడాల గురించి 184 అర్జీలు రాగా అడంగల్‌లో తేడాలు ఉన్నట్లు 22అర్జీలు, పేర్లలో తప్పుల గురించి 5 అర్జీలు మ్యూటేషన్ గురించి 11 అర్జీలు అందినట్లు తెలిపారు. ప్రాధాన్యతాక్రమంలో వీటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు.

తిరుపతమ్మకు వరిగడ్డి వితరణ



పెనుగంచిప్రోలు(వత్సవాయి): గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మవారి ఆలయానికి తెలంగాణ రాష్ట్రం భద్రాది కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన గురజాల గోపి రూ. 50 వేల విలువ చేసే వరి గడ్డిని విరాళంగా గురువారం అందజేశారు. ఆలయానికి భక్తులు అందజేసిన గోవులకు మేతగా వరిగడ్డిని అందజేసినట్లు గోపి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాత గోపిని అమ్మవారి జ్ఞాపికతోపాటు ప్రసాదాలను అందించి సత్కరించారు.

పేద విద్యార్థులకు ఎస్‌బీఐ చేయూత



వేమవరం(వత్సవాయి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెరుగైన విద్య కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సాయం చేస్తుందని ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ నవీన్‌బాబు తెలిపారు. గురువారం ఎస్‌బీఐ సీఎస్‌ఆర్ యాక్టివిటీస్ ద్వారా గ్రామంలోని ఎంపీపీ పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్, కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలను అందించారు. కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ జగదీష్, మక్కపేట బ్రాంచి మేనేజర్ స్వామి, హెచ్‌ఎం మాధవి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.13 లక్షల విరాళం

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎన్టీఆర్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం వారు రూ. 13,08,180 అందజేశారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్యాల శేషగిరిరావు మాట్లాడుతూ తమ సంఘం ద్వారా నవంబర్ నెల కమీషన్ నుంచి 15 శాతం అనగా రూ. 13,08,180 అందజేసినట్లు తెలిపారు. అక్టోబర్‌లో సంభవించిన వరద నష్టం నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి తమ వంతు సహకారంగా అందజేసినట్లు తెలిపారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, ఉపాధ్యక్షుడు ఉప్పుతోళ్ల వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఘనంగా బాబా జన్మదిన వేడుకలు



నందిగామ టౌన్: భగవాన్ సత్యసాయి బాబా 99వ జన్మదిన వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం ఓంకారం, సుప్రభాతం, మంగళహారతి, వేద పఠనంతో పాటు స్వామి వారి పాదుకలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ రమణబాబు చేతుల మీదుగా 99 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కాకతీయ అపోలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సత్యసాయి సేవా సమితి సభ్యులు వాసుదేవరావు, సరికొండ రవీంద్ర, సంగమేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా మారిన గండేపల్లిలోని సంపద తయారీ కేంద్రం

సంపద కాదు.. చెత్తే మిగిలింది!

నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



పైకప్పు లేకుండా చిట్టడవిని తలపిస్తున్న పెండ్యాల సంపద తయారీ కేంద్రం

కంచికచర్ల: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు చెత్త ద్వారా గ్రామపంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకునేలా కోట్లాది రూపాయలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. నిర్వహణ లోపంతోపాటు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం తదితర కారణాలతో చెత్త సంపద కేంద్రాలు పనిచేయడం లేదు. దీంతో సంపద సంగతి అటుంచి గ్రామాల్లో చెత్త పేరుకుపోతోంది.

58 గ్రామాల్లో ఏర్పాటు..

నందిగామ నియోజకవర్గంలో మొత్తం 71 గ్రామ పంచాయతీలు ఉండగా, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద 58 గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో తయారీ కేంద్రాన్ని రూ.4లక్షలతో ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని రిక్షాల ద్వారా చెత్తను సేకరించడానికి క్లాప్‌మిత్రలను నియమించారు. వీరు ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలను తరలించారు. తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టును తయారుచేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరింది. అయితే కొంతకాలంగా ఈ సంపద తయారీ కేంద్రాల్లో పనిచేసే క్లాప్‌మిత్రలకు వేతనాలు ఇవ్వడం లేదు. పంచాయతీల్లో నిధులు కొరత, పలు పంచాయతీల్లో బిల్లుల మంజూరుకు అధికారులు సరిగా సహకరించకపోతుండటం వంటి కారణాలతో క్లాప్ మిత్రలకు వేతనాలు ఇవ్వకపోతుండటతో వారు విధులకు హాజరయ్యేందుకు ఆసక్తి చూపించడం లేదు.



గండేపల్లిలో తొట్లలో పెరిగిన మొక్కలు

పనిచేస్తున్న కేంద్రాలు నాలుగే..

నియోజకవర్గంలో 58 గ్రామ పంచాయతీల్లో ఈ సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తే ప్రస్తుతం కంచికచర్ల, పరిటాల, నందిగామ, చందర్లపాడు పంచాయతీల్లో మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన చోట్ల కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఈ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. విలువైన యంత్ర సామగ్రి కూడా మూలనపడింది. అదేవిధంగా పలుచోట్ల సంపద కేంద్రాలకు ఏర్పాటు చేసిన పైకప్పు రేకులన్నీ పగిలిపోయి ఐరన్ కడ్డీలు దర్శనమిస్తున్నాయి. కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఆయా కేంద్రాల్లో పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో పలు గ్రామాల్లోని ఈ కేంద్రాలకు మందుబాబులకు అడ్డాగా మారాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో నిరుపయోగంగా మారిన సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



పేరకలపాడులో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రం



కీసరలో అసంపూర్తిగా ఉన్న సంపద తయారీ కేంద్రం పనులు



కీసర-గండేపల్లి రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం

వినియోగంలోకి తీసుకువస్తాం

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల ద్వారాచెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించే పనులు సాగుతున్నాయి. త్వరలోనే కంచికచర్ల మండలంలోని అన్ని సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తాం.

– బొజ్జగాని శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ, కంచికచర్ల

సీసీ రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలి



జగ్గయ్యపేట: గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం నిధులతో ఏర్పాటు చేస్తున్న సిమెంట్ రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ రాము పేర్కొన్నారు. మండలంలోని బలుసుపాడు, అన్నవరం, త్రిపురవరం గ్రామాలలో ఉపాధి హామీ పథకం నిధులతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నాటికి నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో గడ్డి పెంపకానికి ఉపాధి నిధులు కేటాయిస్తున్నామని, రైతులకు పథకంపై అవగాహన కలిగించాలన్నారు. అదే విధంగా గ్రామాలలో గోకులం షెడ్లు పూర్తి చేయాలన్నారు. అనంతరం బలుసుపాడులోని జెడ్పీ పాఠశాల రహదారి అధ్వానంగా ఉండటంతో రూ. లక్షతో చేపడుతున్న సీసీ రోడ్డును ఆయన పరిశీలించారు. పంచాయతీ రాజ్ జేఈ శ్రీనివాసరావు, ఏపీవో రామకృష్ణ, ఈసీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు మరింత తోడ్పాటు



చిల్లకల్లు(జగ్గయ్యపేట): పాడి రైతులకు కృష్ణామిల్క్ యూనియన్ మరింత తోడ్పాటునందిస్తుందని యూనియన్ జిల్లా పాలకవర్గ సభ్యుడు చెరుకూరి లవయ్య పేర్కొన్నారు. గ్రామంలోని పాల శీతలీకరణ కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు యూనియన్ పాల సేకరణ ధరను లీటరుకు రూ. రెండు పెంచిందన్నారు. పెంచిన ధరను డిసెంబరు నుంచి అమలు చేసేందుకు పాలకవర్గం ఆమోదించిందన్నారు. పెంచిన ధర బోనస్‌తో కలిసి పాడి రైతులకు అందిస్తామన్నారు. పాడి రైతుల శ్రేయస్సు కోసం యూనియన్ పని చేస్తోందని వివరించారు. జిల్లాలో బోనస్ ద్వారా రూ. 12 కోట్లు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు ఇంజం రామారావు, మేనేజర్ నరేష్, ఆయా గ్రామాల పాల కేంద్రాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడి పూర్తి బాధ్యత యాజమాన్యానిదే

దొనబండ(కంచికచర్ల): విద్యుత్‌షాక్‌కు గురయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి క్రషర్ యాజమాన్యం అవసరమైన వైద్యం అందించటంతో పాటు బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం. సోమేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని పరిటాల దొనబండ క్రషర్‌లో బాధితుడికి న్యాయం చేయాలని గురువారం క్రషర్ వద్ద ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ విజయలక్ష్మి క్రషర్ లారీ డ్రైవర్‌గా పి. శ్రీను పనిచేస్తున్నాడు. అయితే ప్రమాదవశాత్తూ శ్రీనుకు క్రషర్‌లోని విద్యుత్ తీగలు తగలటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు బాధితుడిని వైద్య చికిత్స కోసం విజయవాడ ప్రవేటు ఆసుపత్రికి తరలించారని తెలిపారు. అయితే క్షతగాత్రుడికి వైద్యానికి అవసరమైన మొత్తం ఖర్చును క్రషర్ యాజమాన్యం చెల్లించాలని అంతేకాకుండా బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దుర్గా, రమేష్, శశి, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.



పరిటాల క్రషర్‌లో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కుటుంబ సభ్యులు

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

నందిగామ టౌన్: ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సీఐ వైవీఎల్ నాయుడు అన్నారు. పట్టణంలోని చైతన్య కళాశాల, అపార్ట్‌మెంట్‌లు, ఎస్‌బీఐ బ్రాంచ్‌లో వినియోగదారులకు సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బు మాయం చేసేందుకు సైబర్ నేరగాళ్లు మాయ మాటలు, మోసపూరిత బెదిరింపులకు సైతం పాల్పడుతున్నారన్నారు. అంతే కాకుండా తాము పోలీసులమని మీపై కేసు నమోదైందని భయబ్రాంతులకు గురి చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని, అటువంటి మాటలను నమ్మవద్దని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ఆగిపోతాయి, మీ బ్యాంకు ఖాతా ఫ్రీజ్ అయింది.. మీ ఆధార్ కార్డు అప్‌డేట్ చేస్తాం.. ఓటీపీ చెప్పండి అని అడుగుతారని మోసపోవద్దని సూచించారు. మీకు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

వత్సవాయి: ఎప్పుడూ మూస పద్ధతిలో కాకుండా వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచనలు పాటించాలని వ్యవసాయశాఖ ఏడీఏ భవాని సూచించారు. గురువారం వత్సవాయిలో కోరమండల్ వారి కోరోకేర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎరువులు సస్యరక్షణ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రఖ్యాతిగాంచిన కోరమండల్ సంస్థ రైతులకు ఉపయోగపడేలా అందుబాటులో ఉండే విధంగా షాపులను ఏర్పాటుచేయడం శుభపరిణామన్నారు. ఆధునిక సాంకేతిక సేవలను ఉపయోగించుకుని రైతులు వ్యవసాయం చేయాలన్నారు. రైతులు ముఖ్యంగా పంటమార్పిడి విధానాన్ని అవలంభించాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మొదటిగా వత్సవాయిలోనే కోరోకేర్ సెంటర్‌ను ప్రారంభించారని చెప్పారు. ఏఓ వి. రవికుమార్, జోనల్ హెడ్ మండడి సురేష్, జోనల్ మార్కెటింగ్ మేనేజర్ భాను, రిటైల్ కంట్రోలర్ సత్యనారాయణ, కోరోకేర్ సెంటర్ మేనేజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ భవాని

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడికి చెందిన శ్రీ అభినయ నాట్య అకాడమీ చిన్నారులు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కె.వి.జ్యోతి పర్యవేక్షణలో శిష్యబృందమైన ఎం.హిమబిందు, బి.దీపిక, ఎం.నాగదుర్గ, ఎస్.స్నేహశ్రీ , ఎం.వాగ్మశ్రీ, డి.ధనలక్ష్మి, డి.హేమశ్రీలతో పాటు పలువురు అమ్మవారి కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మహామండపంకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

వేలంతో రూ. 6.26 లక్షల ఆదాయం


నందిగామ టౌన్: సత్యమ్మవారికి పలు రకాల టెండర్లు, బహిరంగ వేలం ద్వారా రూ. 6.26 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో హరిగోపీనాథ్ తెలిపారు. మండలంలోని అంబారుపేట గ్రామంలోని ఆలయ ఆవరణలో గురువారం కొబ్బరికాయలు, నిమ్మకాయలు, పూజా సామగ్రి, అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్‌లు విక్రయించుకునే హక్కుకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరికాయలు, నిమ్మకాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు రూ. 4.11 లక్షలు, చీరలు, జాకెట్ ముక్కలు అమ్ముకునే హక్కునకు రూ. 2.15 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ పవన్‌కల్యాణ్, ఏవో మోహన్, నాయకులు చుండూరు వాసు, మాదవ, రమేష్, తేల్రప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి మోక్షం ఎప్పుడో?

- రూ 3.50 కోట్లతో రెండతస్తుల టీటీడీ కల్యాణ మండపం
- వంటశాలతో పాటు చిన్న చిన్న పనులు పెండింగ్
- త్వరితగతిన పూర్తి చేసి వాడుకలోకి తేవాలంటున్న ప్రజలు



నిర్మాణ దశలో టీటీడీ కల్యాణ మండపం



నిర్మాణం పూర్తయిన డైనింగ్ హాల్

జగ్గయ్యపేట అర్బన్: అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్నచందంగా తయారైంది జగ్గయ్యపేట ప్రజల పరిస్థితి. ఇక్కడి స్థానికుల చిరకాల స్వప్నం అయిన టీటీడీ కల్యాణమండపం నిర్మాణం దాదాపు పూర్తయినా.. ఇంకా వాడుకలోకి తీసుకు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దశాబ్దాలుగా జగ్గయ్యపేట ప్రజలు ఎదురు చూస్తున్న టీటీడీ కల్యాణమండపం కోసం స్థానిక చిల్లకల్లు రోడ్‌లో వైఎస్ సర్కిల్ వద్ద 2009లోనే శంకుస్థాపన చేసినా.. పనులు ప్రారంభం కాలేదు. తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభించి దాదాపు పూర్తి చేశారు. తుది దశలో కొన్ని పనులు మిగిలి ఉన్నాయి. వీటిని పూర్తి చేసి, కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తేవడంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

ఇదీ సంగతి..

పేటలోని పేద, మధ్య తరగతి ప్రజల అవసరాల కోసం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. టీటీడీ ద్వారా రూ 1.30 కోట్లు నిధులు సైతం ఆయన మంజూరు చేయించారు. వాటికి పబ్లిక్ కంట్రిబ్యూషన్ కింద రూ. 13 లక్షలు కూడా జమ చేసి ఎకరంన్నర స్థలంలో 2009 ఫిబ్రవరి 27న శంకుస్థాపన చేశారు. అయితే మహానేత మరణంతో ఆ పనులు పట్టించుకున్న నాథుడు లేడు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగిపోయిన టీటీడీ కల్యాణ మండప నిర్మాణం మళ్లీ తెరపైకి వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయి. రెండంతస్తులతో కూడిన ఏసీతో కల్యాణ మండపం నిర్మాణానికి రూ 2.50 కోట్లు, ప్రహరీ నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరు చేశారు. వీటికి 20 శాతం పబ్లిక్ కంట్రిబ్యూషన్ కింద రూ. 50 లక్షలు చెల్లించాల్సి ఉండగా, గతంలో చెల్లించిన రూ. 13 లక్షలతో పాటు ఇప్పుడు రామ్‌కో సిమెంట్స్ వారు ముందుకు వచ్చి రూ. 37 లక్షలు టీటీడీకి చెల్లించారు. దీంతో 2023 ఫిబ్రవరి 21న నిర్మాణ పనులు మొదలయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో డైనింగ్ హాల్, కిచెన్, టాయిలెట్స్ తదితర 6 గదులు, పై అంతస్తులో 500 మందికి సరిపోయే విధంగా కల్యాణమండపం, 2 గదులు నిర్మించారు. ఈ నిధులు సరిపోకపోవడంతో డైనింగ్ హాల్, కిచెన్, వాటర్ సంపు నిర్మాణాల నిమిత్తం తర్వాత మరొక రూ. కోటి నిధులు మంజూరు చేశారు. దీంతో మొత్తం రూ 2.50 కోట్లతో కల్యాణమండపాన్ని దాదాపు పూర్తి చేశారు. మరో రూ. కోటితో చేపట్టాల్సిన వంట శాల నిర్మాణం కోసం టెండర్లు పిలవాల్సి ఉంది.

ఎదురుచూస్తున్నాం..



టీటీడీ కల్యాణ మండపం కోసం పట్టణ ప్రజలే కాక, చుట్టు పక్క గ్రామాల ప్రజలు కూడా ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం దాదాపుగా పూర్తయింది. మిగిలిన చిన్న చిన్న నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయించి కల్యాణ మండపాన్ని ప్రారంభించాలి.

– మార్తి రాంబాబు, బలుసుపాడు గ్రామ నివాసి

వాడుకలోకి తేవాలి..




ప్రభుత్వాలు శాశ్వతం కాదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా జరుగుతూ వస్తున్న అభివృద్ధి పనులు ఆగకూడదు. అలా జరిగితే కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతాయి. ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ కల్యాణ మండపాన్ని వాడుకలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– చౌడవరపు జగదీష్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు

ముమ్మరంగా శానిటేషన్ పనులు

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో శానిటేషన్ పనులు చేపట్టామని సర్పంచ్ బొక్కా రవికుమార్ గురువారం పేర్కొన్నారు. గ్రామంలో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించటంతో పాటు మురుగునీరు పారుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేకాకుండా డ్రెయినేజీల్లో బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామని గ్రామంలో ప్రజలు రోగాలబారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిత్యం ప్రజలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని, ప్రధాన పైపులైన్లు మరమ్మతులకు గురయితే, వెంటనే బాగు చేయించి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ రవికుమార్

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



కంచికచర్ల: శ్రీ శివసాయిక్షేత్రంలో అయ్యప్ప మహా పడి పూజా కార్యక్రమం గురువారం రాత్రి కనులపండువగా జరిగింది. అయ్యప్ప నామస్మరణతో క్షేత్ర ప్రాంగణమంతా మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కేరళ తాంత్రిక శ్రేష్ఠ గురువు నంబూద్రి పద్మనాభన్ పప్పాస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజా జరిగింది. అయ్యప్ప స్వామి 18 మెట్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి అయ్యప్ప గణపతి, కుమారస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అయ్యప్ప స్వాములు కీర్తనలు పాడుతూ, భజనలు చేస్తూ స్వామిని కొలిచారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల అందజేత

నందిగామ టౌన్: మండలంలోని లింగాలపాడు గ్రామ శివారు లచ్చపాలెంలోని వృద్ధాశ్రమంలో దాతలు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు గింటజుపల్లి వెంకటయ్య గురువారం నిత్యావసర సరుకులను నిర్వాహకులకు అందజేశారు. వృద్ధులకు తన వంతుగా సహకారం అందించటం సంతోషంగా ఉందన్నారు.